https://vijayamdaily.com

# విజయం

పేజీలు :
08

- అక్షర సమరానికి నాంది..

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శనివారం / మార్చి 25 / 2023

https://vijayamdaily.com





కష్టే ఫలి నానుడి మాట. అందుకు అనుగుణం గానే జీవితంలో గెలిచేందుకు రైతన్న పోరు సాగస్తున్నాడు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి ముందుకు పయన మౌతున్నాడు. భూ సారాన్ని పెంచి దిగుబడిని తీసేందుకు రైతు సోదరులు ఓ పెద్ద యుద్ధమే చేస్తున్నారు. పంట దిగుబడులకు దోహద పడే ఎలాంటి ఎరువుల నైనా,పిచుకారి మందుల నైనా వాడడంలో పోటీపడి ఫెర్టిలైజర్ దుకాణ యాజమాన్యాల వద్ద దగా పడుతున్న విషయం బహిరంగ రహస్యమే. ఆరుగాలం శ్రమించే రైతు కష్టాన్ని ఒక పక్క దళారీ చేతి వాటంతో దోపిడీ చేస్తున్నాడు. మరో పక్క చేతికందిన పంట మార్కెట్లో ధర పలకిన వేళ ప్రకృతి క్రోదానికి రైతు శోకిస్తున్నాడు. రైతన్న దుఃఖానికి కారణమయ్యే ప్రకృతిని అడ్డుకోవడం అధికారికి సాధ్యపడదు. వేల కుటుంబాల కష్టాన్ని దోపిడి చేస్తున్న దళారి అంతటితో ఆగకుండా నాణ్యత పరీక్ష పేరుతో రైతు వద్ద సుమారు రెండు కేజీల మిర్చిని గుమస్తాలతో ఎత్తుకెళ్తున్న అంశంపై, ఫెర్టిలైజర్ దుకాణాల దోపిడీని బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్న అధికారుల వత్తాసుపై మీ విజయం దినపత్రిక ప్రత్యేక కథనం.

# వ్యాపారి దగ.. వరుణుడి పాగ..

- దళారి పరీక్షకు 2 కేజీలు
- వ్యాపారికి..ప్రకృతికి రైతన్నే టార్గెట్.
- ఆగమైన మిర్చి పంటకు విలపిస్తున్న కుటుంబాలు
- దళారుల దోపిడీలో పాత్రధారులుగా వ్యవసాయ అధికారులు..
- దళారి దండులో అధికారుల వాటా కంటి తుడుపుగా ప్రజాప్రతినిధుల పర్యటనలు

ములుగు/నూగురు వెంకటాపురం/ మార్చి 24(విజయం న్యూస్):
ఎరువుల కంపెనీలకు, రైతుకు దళారి మధ్యగా ఉంటున్నాడు. ఈ దళారి రైతుకు కొంత సొమ్మును, ఎరువులను ఉచితంగా అందించి వ్యవసాయానికి దోహద పడతానని, పంట చివరులో సొమ్ము ఇద్దువుగానని చెప్పడంతో రైతన్న కొండంత ఆశతో సాగుకు సిద్ధ పడుతున్నాడు. దళారి సాగుకు దోహదపడే అంశం వాస్తవ మైనప్పటికీ అధిక వడ్డీలు వేసి పిచికారి మందులపై, ఎరువులపై పెద్ద మొత్తంలో దోచుకుంటూ రైతులను కూలీలుగా మార్చుతున్నారు. తొలకరి చినుకు పడినప్పటి నుండి సాంప్రదాయ పంటతో మొదలుకొని వాణిజ్య పంటలు ముగిసే వరకు రైతు శ్రమిస్తూనే ఉన్నాడు. ఈ రెండు పంటలను పండించేందుకు ఎక్కువ శాతం కృత్రిమ ఎరువుల పైనే ఆధారపడి పంట సాగు చేస్తున్నాడు. వెంకటాపురం మండలంలో సాధారణ జీవితం గడిపిన కొందరు ఫెర్టిలైజర్ యాజమాన్యాలు కోటీశ్వరులుగా ఎలా ఎదిగారు? అనే ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు సమాధానం మౌనం వహిస్తుంది. శ్రమదానం చేయలేక కుటుంబ పోషణ కొరకు చిన్నపాటి వ్యాపారంగా మొదలుకొని ప్రజలను శాసించే స్థాయికి నిజాయితీగా ఎలా ఎదుగుతున్నారు..? సెంటు భూమి కూడా లేనివారు.. పదుల సంఖ్యలో భూములను ఎలా సంపాదిస్తున్నారు..?

మిగతా 2లో..

## బావకు సీటోచ్చిన కలిసి
# పనిచేస్తాం..

- మాకు సీటోచ్చిన పనిచేస్తారనే నమ్మకం ఉంది
- సంచలన వ్యాఖ్యలు చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- కలిసిపనిచేద్దామని చెప్పిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి
- కూసుమంచిలో జనచైతన్య బహిరంగ సభ
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

7లో..






## బీజేపీ దుశ్చర్యకు
# పరాకాష్ట

- ప్రజాస్వామ్య దేశంలో ఇలా జరగడం దురదృష్టకరం
- దేశ చరిత్రలో చీకటి రోజు

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు

ఖమ్మం,మార్చి 24(విజయం న్యూస్):
రాహుల్ గాంధీపై అనర్హత వేటు కేంద్ర ప్రభుత్వ దుశ్చర్యకు పరాకాష్ట అని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ ఆయన పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తారనే భయంతోనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. 9లో..

## పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనదే
# ప్రభుత్వ లక్ష్యం

- కార్పోరేషన్ వ్యాప్తంగా మొత్తం 2500 మందికి పట్టాలు ఇస్తున్నాం..
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు.. పేదలకు లబ్ధిచేకూరేలా మళ్ళీ దరఖాస్తుకై ఏప్రిల్ 30వరకు గడువు పొడిగింపు
- నగరంలోని 8,14,15వ డివిజన్ పేదలకు 406 పట్టాలు పంపిణీ చేసిన మంత్రి




# నాడు గలగల..నేడు వెలవెల

తను లేకుంటే ఎవరికి కబుర్లు చేరవని ఎగిసి పడింది. సమాజానికి నేనే రాజునని ఫీల్ అయ్యింది.. నాతోనే 'ఉత్తర' దర్శనమనుకుంది.. అందరు నన్నే కలవరిస్తున్నారని, నన్ను తలుచుకుంటున్నారని.. నా వద్దకే పరుగులు తీస్తున్నారని మురిసింది.. నా అంతటి వాడే లేడని కొడిపిల్లవలే ఎగిరేగిరిపడింది.... కానీ.. నేడు.. తన కబురు పట్టించు కొనే వారు లేరని దిగులు పడింది. పదవి.. పరపతిలో వున్నానని ఎగిసిపడితే.. అందరి జీవితాలు ఇలాగే అవడం ఖాయం.. పదవి పోయిన నాడు నీవు ఒక డబ్బావే.



# వ్యాపారి దగ..వరుణుడి పాగ

మొదటి పేజీ తరువాయి..

అనేక ప్లాట్లు,ఎత్తైన భవనాలు ఎలా వస్తున్నాయి? గ్రామ కంఠంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసి విద్యను వ్యాపారంగా మార్చే స్థాయికి ఎదిగిన తీరు పలు విమర్శలకు తావిస్తుంది. ఇంతటి వైభోగ మంత రైతుల కష్టమేనని విమర్శ ఉంది. దళారీలు ఈ విధంగా రైతులను దగా చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటు ఎదుగుతున్నారు.

ఈ దోపిడి చాలదన్నట్లుగా వనరుడు కూడా పగ పట్టినట్లు పంట చేతికొచ్చిన వేళ..మార్కెట్లో ధర పలకగా అదును చూసి పంజా విసరడంతో రైతన్న విలవిల లాడుతున్నాడు. మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో మిర్చి తోటలు, మొక్కజొన్నలు నేలకొరిగాయి. గోదావరి పాయలోనూ, పొలాల్లోనూ ఆరబెట్టిన మిర్చి తడిసి ముద్ద అయిపోయింది. తడిసిందన్న సాకుతో అదునుగా భావించి దళారులు ధరను తగ్గిస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట క్షణాల్లో నాశనం అయింది. రైతులు వారి కల్లాల వద్ద, చేను ల వద్ద బోరున విలపిస్తున్నారు.

## దళారి పరీక్షకు 2 కేజీలు

మండలంలో చాలామంది చిన్న, సన్న కారు రైతులు మార్కెట్ ల వద్దకు వెళ్లలేక ఉన్నచోటే దళారికి అమ్ముతున్నాడు. మండల వ్యాప్తంగా పదుల సంఖ్యలో మిర్చిని కొనే దళారి దండు తయారైంది. వీరందరూ సిండికేట్ గా మారి మరో కొత్త రకం దోపిడీకి తెర లేపారు. గుమస్తాలను ఏర్పాటు చేసుకొని వారితో ప్రతి రైతు వద్ద రెండు కేజీలకు తగ్గకుండా మిర్చిని తేవాలని ఆర్డర్ పాస్ చేసినట్లు తెలుస్తుంది. ఇంత మిర్చి ఎందుకని రైతులు ప్రశ్నించగా మా యజమాని ఇంతే తెమ్మంటున్నాడని తేల్చడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫెర్టిలైజర్ యజమాన్యాల దోపిడి, ప్రకృతి కన్నెర్ర చాలదన్నట్లు కొత్తరకం దోపిడీతో రైతన్నలు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు.

రైతులు వేసిన పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి తెగుళ్ల నివారణకు తగు సూచనలు ఇవ్వాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులకు ఎంతైనా ఉంది. కానీ వ్యవసాయ అధికారులు మండల కేంద్రంలో పనిచేస్తున్నట్లు చాలా గ్రామాల్లో అసలు తెలియనే తెలియదు. దీన్నిబట్టి వారు విధులు ఎంతటి గొప్పగా నిర్వహిస్తున్నారో? అర్థమవుతుంది. పంటలకు ఏదైనా తెగులు వచ్చిందంటే ఫెర్టిలైజర్ యాజమాన్యాలే దానికి విరుగుడు చూపిస్తూ పెద్ద మొత్తంలో దోపిడి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫెర్టిలైజర్ దుకాణాలలో అధికారులు ఎప్పటికప్పుడు సోదాలు నిర్వహిస్తున్నారా? రైతుకు సరైన మందులను చూపిస్తున్నారా? కాలం చెందిన మందులను కట్టడి చేస్తున్నారా? కో కొల్లలుగా వెలుస్తున్న ఎరువుల దుకాణాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారా? ఇటువంటి మరెన్నో ప్రశ్నలకు నోటు సమాధానం చెబుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీలో నూతనంగా ఫెర్టిలైజర్ దుకాణం ఏర్పాటు చేయాలంటే వ్యవసాయ అధికారికి 50 వేల రూపాయలు ఇస్తే పని జరుగుతుందన్న విమర్శ ఉంది. ఓ రకంగా అధికారులే దోపిడీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని ప్రజలు చెవులు గొనుక్కుంటున్నారు. అటువంటిది యాజమాన్యాలు చేసే దోపిడిని ఎట్లా అరికడతారనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ ఇచ్చింది పుచ్చుకుంటూ విధులు నిర్వహిస్తున్నారని సామాన్యులు ఘాటైన విమర్శలు చేస్తున్నారు.

## దళారి దండులో అధికారుల వాటా:

మారుమూల ఏజెన్సీ ప్రాంతం కావడంతో రైతు పండించిన పంట విక్రయానికి సరైన సదుపాయాలు లేవు. ఇది అదునుగా భావించిన కొందరు దళారులు రైతుల అమాయకత్వాన్ని లాభపేక్షగా మార్చుకుంటున్నారు. రైతుల వద్దనే కొనుగోలు పేరుతో వాజేడు, వెంకటాపురం రెండు మండలాలను ఎంచుకొని ఘరానా దోపిడికి పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా పోలీస్, రెవిన్యూ, వ్యవసాయ అధికారులతో మాట మంచి కలిపి మూట గట్టుకొని మచ్చిక చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ప్రతి ఒక్కరికి వేల రూపాయలు ముట్టజెప్పి ముప్పు లేకుండా అడ్డు తొలగిస్తూ అక్రమంగా ధనార్జన దండుకుంటున్నట్లు బహిరంగంగానే ప్రగల్భాలు పలుకుతున్నట్లు విమర్శ. ఏదేమైనప్పటికీ దేశానికి అన్నం పెట్టే రైతు పొట్ట కొడితే తప్ప మిగిలిన వారికి జీవనం,జీవితం లేదన్నట్లుగా కనిపిస్తుంది.

## కంటి తుడుపుగా ప్రజాప్రతినిధుల పర్యటనలు:

వర్షం వచ్చింది.. పంట తడిసింది.. రైతన్నలకు కన్నీళ్లను మిగిల్చింది. పంట చేనుల వద్ద, మిర్చి కల్లాల వద్ద రైతు విలపిస్తున్న వేళ మండలంలో కొందరు ప్రజాప్రతినిధులు కంటి తుడుపు చర్యగా ఓదార్పు నిస్తూ పర్యటించారు. ఈ పర్యటనలు రైతులకు ఉపశమనాన్ని కలిగించినవే తప్ప.. చేయూతను అందించలేక పోయాయి. అధికార పార్టీ పెద్దల మాటలను కూడా రైతు పూర్తిస్థాయిలో నమ్మే పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదు. గతంలో పక్క జిల్లాలో వర్షాల వేటుకి రైతు కూలబడ్డాడు. అక్కడ మంత్రులు సైతం పర్యటించి, ప్రభుత్వాన్ని ఒప్పించి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారే తప్ప అమలు చేయలేదు. ప్రభుత్వం అప్పటి లాగానే ఇప్పుడు వ్యవహరిస్తుందన్న సందిగ్ధంలో రైతు ఊగిస లాడుతున్నాడు. గులాబ్ తుఫాను వల్ల రైతన్నకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఈసారైనా ఆదుకొని ఓదారిస్తే బాగుండనే ఆశాభావాన్ని రైతు వ్యక్తపరుస్తున్నాడు. విజిలెన్స్ అధికారులు, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి ఫెర్టిలైజర్ యాజమాన్యాల దోపిడిని కట్టడి చేయాల్సిందిగా, దగా చేస్తున్న యాజమాన్యాల లైసెన్సులను రద్దు చేసి రైతుల అభ్యున్నతికి పాటు పడాల్సిందిగా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. నష్టపోయిన రైతుల కొరకు తెచ్చిన జీవోను జాప్యం చేయకుండా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



## గాలివానకు నేలమట్టంకి చేరిన పూరి గుడిసె

**అశ్వాపురం మార్చి 24 (విజయం న్యూస్)**

అశ్వాపురం మండలంలోని మొండికుంట గ్రామంలో శుక్రవారం వచ్చిన గాలి వానకు నేల మట్టం అయినా పూరి గుడిసె. గ్రామంలోని వర్ష శంకర్ దంపతులు నివసిస్తున్న ఈ గుడిసెలో వారు ఉండగానే కూలిపోయింది. స్వల్ప గాయాలతో బయటపడ్డ కుటుంబం.ఈ విషయాన్ని తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించిన మొండికుంట ఉప సర్పంచ్ మేడ వరపు సుదీర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాటి మన్మథరెడ్డి , గ్రామ ప్రజలు.



## అత్యుత్తమ గ్రామపంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం

**అశ్వాపురం మార్చి 24 (విజయం న్యూస్)**

మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం 2021-2022 సంవత్సరానికి గాను ప్రకటించిన అత్యుత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను అశ్వాపురం గ్రామపంచాయతీకి స్వయం సమృద్ధి మౌలిక వసతుల కల్పన, మహిళల స్నేహపూర్వక పంచాయతీ సంకల్పాలలో ప్రథమ బహుమతి అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శులను శాలువలతో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రములు, షీల్డ్స్, అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ ముత్తినేని సుజాత, జడ్పిటిసి సూది రెడ్డి సులక్షణ, ఎంపీడీఓ గంటా వరప్రసాద్, తహసిల్దార్ ఎంఎ రాజు, ఎంపీఓ భూక్య శ్రీనివాస్ , మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కంటివెలుగును ప్రారంభించిన కౌన్సిలర్

**(ఇల్లెందు-విజయంన్యూస్)**

ఇల్లెందు పట్టణంలోని 11వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆ వార్డు కౌన్సిలర్ జె.కె.శ్రీను ప్రారంభించారు. సింగరేణి స్కూల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దమ్మరపాటి వెంకటేశ్వరరావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

**- నష్టపోయిన పంటలకు రూ.10వేలు అందించిన ఘనత సీఎం కేసీఆర్ దే**

**- ఖమ్మంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మంత్రి పువ్వాడ**

**(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్ష ప్రభుత్వమని, సీఎం కేసీఆర్ కూడా రైతు పక్షపాతి అని రాష్ట్ర రవాణాశాఖ మంతరి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కిందని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా నష్టపోయిన పంటల వైపు తిరిగి చూడలేదని ఆరోపించారు. నష్టపోయిన పంటలకు రూ.10వేలు ఇవ్వడం పట్ల మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో పాటు.. రైతులు హర్షం వ్యక్తం చేశారు. నిన్న ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ హామి ఇవ్వడం పట్ల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం ముమ్మాటికీ "రైతు ప్రభుత్వమే" అంటూ రైతులు నినాదాలు చేశారు. ఇప్పుడిప్పుడే రైతులు నిలదొక్కుకుని స్థిరపడే పరిస్థితికి వస్తున్న క్రమంలో.. మంచి దిగుబడి వచ్చి అప్పుల నుంచి తేరుకుంటామని భావిస్తున్న తరుణంలో ఆకాల వర్షం రూపంలో రైతులను మళ్ళీ అప్పుల ఊబిలోకి



వెళ్లకుండా ప్రభుత్వం ఆదుకుంటుందన్న మాటతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ సందర్భంగా ఖమ్మం నగరం 15వ డివిజన్ అల్లిపురంలో రైతుల అధ్వర్యంలో మొక్క జొన్న చేలులో రైతులతో కలిసి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్షీరాభిషేకం చేశారు.

### ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో

ముఖ్యమంత్రి కెసిఆర్ రైతులకు పంట నష్ట పరిహారం రూ.10,000 ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రైతు నాయకుడు సీఎం కేసీఆర్అని, ఏ ముఖ్యమంత్రి కూడా రైతుల గురించి పట్టించుకోలేదనినాయకులు తెలిపారు. దేశ్ కి నేత, రైతుకు నేత కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, జడ్పీ చైర్మన్ కమల్ రాజు, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు,యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చైతన్య ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం




**- మరో పోరాటానికి యువత సిద్ధం కావాలి**

**- సెమినార్‌లో బాగం హేమంతరావు**

**(ఖమ్మం-విజయంన్యూస్):**

భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో భగత్సంగ్, రాజ్గురు సుఖవ్ల 92వ వర్ధంతి సందర్భంగా అమర వీరుల ఆశయాలు - మన కర్తవ్యం అనే అంశంపై ఖమ్మం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి పోరాటంలో పాల్గొన్నారని అటువంటి వారిలో అగ్రగణ్యులు భగత్సింగ్, రాజగురు సుఖదేవ్ లని ఆయన తెలిపారు. భగత్సింగ్ కులం, మతం ప్రస్తావన లేని సమాజం కోసం పరితపించారని కానీ ఇప్పటి పాలకులు మతాన్ని ఓట్ల ఆయుధంగా మలుచుకుంటున్నారన్నారు. పేరుకు ప్రజాస్వామ్య దేశమైనా హక్కుల హననం జరుగుతుందని వాక్ స్వాతంత్రానికి భంగం కలిగిస్తున్నారని ప్రశ్నించే గొంతులను నొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని హేమంతరావు ఆరోపించారు. సమాజాన్ని మార్చగలిగిన శక్తి, పోరాట పటిమ యువతకే ఎక్కువగా ఉంటాయని ప్రస్తుత సామాజిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాలకు యువత సిద్ధం కావాలన్నారు. నూనూగు మీసాల ప్రాయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన భగత్సింగ్ చూపిన బాటలో పయనించాలని ఆయన కోరారు. సామాజిక స్థితి గతులను ప్రజలకు వివరించాలని ప్రజా చైతన్యంతోనే ఉద్యమాలు విజయవంతమవుతాయని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ బాధ్యులు జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ, యాక్ట్ పెట్టాలని సిపికి వినతి




**ఖమ్మం,మార్చి 24(విజయంన్యూస్)**

రఘునాథపాలెం ఎస్ఐపై ఎస్సీ,ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ కు లంబడి హక్కుల పోరాట సమితి(ఎల్ హెచ్ పి ఎస్), బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. డాక్టర్ ధరావత్ ప్రీతి ఆత్మహత్య ఉదంతం పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ,సూపర్డెంట్ లతో పాటు నిండితుడు సైఫ్, పోలీసుల ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13వ తేదీన ఎల్.హెచ్.ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం ఎస్సై మాచినేని రవి, తిరుమలాయపాలెం మండల ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షుడు భూక్య వీరన్నతో వాగ్వివాదం జరపటమే కాకుండా అడ్డుకొని, కులం పేరుతో దూషిస్తూ,భౌతిక దాడి చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డారని వారు వినతిపత్రంలో ఆరోపించారు. ఇతర నాయకుల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తించాలని వినతి పత్రంలో వివరించారు. అదేవిధంగా లంబాడీలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, అగ్రకుల అహంకారంతో ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు .వెంటనే ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ ఉదంతం పై రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సిపికు దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ ఒక లేఖను పంపిందని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన బృందంలో ఆయా సంఘాల నాయకులు బద్రు నాయక్, రాజేష్ నాయక్, సతీష్ నాయక్, బి జంపా, బి.ఉపేంద్ర, టి. రమ్య ఎస్ కే. నజీమా ,నకరికంటి సంజీవరావు, కిషన్ నాయక్, వీరన్ననాయక్, రవీందర్ నాయక్, కోటేష్ నాయక్ , హరి నాయక్, చందన శ్రీ, సలీం, అఖిల్ తది తరులున్నారు.

## ఖమ్మం విద్యార్థినికి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్

**(ఖమ్మం-విజయం న్యూస్)**

ఖమ్మం నగరానికి చెందిన విద్యార్థినికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆబ్జెక్టివ్ ఆఫ్ టీచింగ్ ఇంగ్లీష్ ఇన్ ఇండియా అనే పరిశోధనపై డాక్టరేట్ ప్రధానం చేశారు. ఖమ్మం నగరం ఎస్పీ ఆఫీస్ రోడ్డు సుగ్గుల వారి తోటకు చెందిన రెంటాల ఇజ్రాయిల్ కుమార్తె రెంటాల జ్ఞాన లత సంబంధిత సబ్జెక్టుపై మూడున్నర సంవత్సరాల పాటు పరిశోధన చేసి ఇంగ్లీష్ సబ్జెక్టు పై విద్యార్థులకు సులభతర బోధన, అవగాహన విషయాలపై ప్రొఫెసర్ కనకదుర్గ ద్వారా ప్రాజెక్టును సమర్పించి డాక్టరేట్ ను పొందారు. ఖమ్మం నగరంలో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు చదివి హైదరాబాదులో ఏంఎ ఇంగ్లీష్, బీఈడీ ఎంఫిల్ చేసారు. తాజాగా నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. డాక్టరేట్ పొందిన జిల్లా వాసి రెంటాల జ్ఞానలత కు పలువురు అభినందనలు తెలియజేశారు.





## శ్రీ కోట మైసమ్మ తల్లి హుండీ ఆదాయం రూ:72871

**కామేపల్లి మార్చి 24(విజయం న్యూస్)**

శ్రీ కోట మైసమ్మ అమ్మ వారి దేవస్థానం కొత్త లింగాల గ్రామం శుక్రవారం శ్రీ అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఖమ్మం విభాగము ఆర్. సమత పర్యవేక్షణలో నిర్వహణ అధికారి యన్. శేషయ్య, ఛైర్మెన్ మల్లెంపటి శ్రీనివాసరావు సమక్షంలో హుండీని తెరిచి లెక్కించారు.రూ:72871, పూజా టికెట్ ల పై రూ:13,346 లు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమములో సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, జస్తిపల్లి ఉప సర్పంచ్ బత్తుల పుల్లయ్య, అర్చకులు వెంకట పుల్లయ్య శర్మ, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## దశ దిన ఖర్మలకు ఆర్థిక సహాయం అందచేసిన మండల మున్నూరు కాపు సంఘం

**అశ్వాపురం మార్చి 24 (విజయం న్యూస్)**

మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన లింగాల అప్పారావు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యం తో మృతి చెందగా శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు దశ దిన ఖర్చుల నిమిత్తం మండల మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో రూ 7500 అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కమటం వెంకటేశ్వరరావు ,ప్రధాన కార్యదర్శి కమటం సురేష్,యువజన సంఘం అధ్యక్షులు పర్వత నరేష్, నరేష్ ,మానాది మల్లయ్య, తోట నర్సయ్య, రాగం మల్లయ్య, కమటం శంకర్,బచ్చు వెంకటరమణ, దండి నాగేశ్వరరావు ,ముగ్గు కృష్ణ,లింగాల శివ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల వివరాలు :

ఖమ్మం: స్టాఫ్ రిపోర్టర్, ఖమ్మం ఆర్‌సి ఇన్‌చార్జ్, ఖమ్మం నగరం,కార్పో రేషన్, క్రైమ్, ఎడ్యుకేషన్.

పాలేరు: నేలకొండపల్లి, ఖమ్మం రూరల్.

మధిర: ముదిగొండ, బోనకల్, చింతకాని, మధిర టౌన్, మధిర ఆర్‌సి ఇన్‌చార్జ్.

సత్తుపల్లి: సత్తుపల్లి ఆర్‌సి ఇన్‌చార్జ్. సత్తుపల్లి టౌన్, ఎడ్యుకేషన్ పెనుబల్లి, వేంసూర్, కల్లూర్.

వైరా: వైరా ఆర్‌సి ఇన్‌చార్జ్. వైరా టౌన్,సుజాత నగర్, కొణిజర్ల, కారేపల్లి.

విలేకర్లు కావలెను

www.epaper.vijayamdaily.com

విజయం

అక్షర సమరానికి నాంది

సమాజం, స్థానిక రాజకీయ అంశాలపట్ల కనీసం అవగాహ కలిగి ఉండి చక్కని రాత, ఓర్పు, నేర్పు గల జర్నలిస్టులకు విజయం తెలుగు దిన పత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు ఆసక్తి గల వారు సంప్రదించగలరు.

సంప్రదించాల్సిన నెంబర్: 9346985298,9177450436

# రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

## ఎమ్మెల్యే రాములు నాయక్ ఎమ్మెల్సీ తాతా మధుకు వినతి



కారేపల్లి మార్చి24 (విజయం న్యూస్):

రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 4000 మంది రెండో ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని మా శ్రమకు తగ్గ వేతనం ఇప్పించండి, మా ఉద్యోగాలు పర్మినెంట్ చేయండి, మా సమస్యలను మన ముఖ్యమంత్రి కేసీఆర్ కు తెలియపరచాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావుకు సింగరేణి మండల పరిధిలోని పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు దరఖాస్తు అందజేశారు. శుక్రవారం మండల పరిధిలోని పేరేపల్లి గ్రామంలో జరుగుతున్న టీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా వచ్చినటువంటి ఎమ్మెల్యే , ఎమ్మెల్సీలకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వట్టి సెకండ్ ఏఎన్ఎంలు మా శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి, మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి, మా ఉద్యోగం నియమ నిబంధన ప్రకారం మాత్రమే పని చేయించాలి అదనపు పనులు మాతో చేయిస్తున్నారు. అలాంటి పనులు వల్ల మాకు మానసిక ఒత్తిడి ఎక్కువవుతుంది, దానివల్ల మాలో కొందరికి బీపీ షుగర్లు వస్తున్నాయి. ప్రభుత్వం మా సమస్యను గుర్తించి వెంటనే మా శ్రమకు తగ్గ వేతనంతో పాటు, మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కి తమ ద్వారా తెలియపరచాలని ఎమ్మెల్యే ఎమ్మెల్సీకి దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు జర్పుల పుష్ప, పి. నాగమణి,యం నాగమణి, కల్పన,విజయకుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న మొక్కజొన్న పంట- సర్వే ప్రారంభం

- పరిహారంపై రైతుల ఆశలు

ఏన్కూరు, మార్చి 24 (విజయం న్యూస్)

ఏన్కూర్ మండలంలో గత కొన్ని రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతిన్నది. పంట నష్టంపై శుక్రవారం నుంచి వ్యవసాయ శాఖ అధికారులు సర్వే మొదలుపెట్టారు. ఈ ఏడాది మండలంలో సుమారు 400 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కేసుపల్లి, టిఎల్ పేట, తిమ్మారావుపేట, బిఆర్ పురం, ఏన్కూరు, నాచారం తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి సుమారు 50 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు. తీరా పంట చేతికొస్తున్న తరుణంలో అకాల వర్షం నట్టేట ముంచింది. దీంతో రైతులు లబోదిబో అంటున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల వచ్చిన ముఖ్యమంత్రి పంట నష్టం విషయంలో రైతులను ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు పంట నష్టపరిహారం పై ఆశలు పెట్టుకున్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్ట వివరాలపై



సర్వే మొదలుపెట్టారు. దీంతో రైతులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో మొక్కజొన్న పంట నష్టం పై సర్వే చేసి సమగ్ర నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



## ఏన్కూర్ పి హెచ్ సి ని సందర్శించిన ఎన్. క్యు .ఏ. ఎస్ జాతీయ బృందం

ఏన్కూరు మార్చి 24 (విజయం న్యూస్)

ఏన్కూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జాతీయ నాణ్యత ప్రమాణాల పరిశీలన బృందం సందర్శించింది. ఆసుపత్రి లోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఓ పి, ఐపి సేవలు, లేబరేటరీ ఆరోగ్య కార్యక్రమాలు, జనరల్ అడ్మినిస్ట్రేషన్ 104, 102, 108 సేవలను పరిశీలించింది .ఇంకా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించింది. పి హెచ్ సి పరిసరాలను పరిశీలించారు. వీటన్నిటిపై రికార్డు తయారు చేసి ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బృందం సభ్యులు డాక్టర్ బాలచందర్, డాక్టర్ సంధ్య, జిల్లా మేనేజర్ ఉపేందర్, స్థానిక డాక్టర్లు రాములు, ఆల్తాఫ్, సిహెచ్ఓ శివరాజు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై లోక్‌సభ సెక్రటేరియట్‌అనర్హత వేటు సరేంది కాదు

### కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి

కామేపల్లి మార్చి 24 (విజయం న్యూస్)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై లోక్‌సభ సెక్రటేరియట్‌అనర్హత వేటు వేయడం సరేంది ని కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.రాహుల్‌పై అనర్హత దుర్మార్గమన్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ బయటపట్టిన అదానీ కంపెనీ కుంభకోణంపై చర్చ జరగకుండా బీజేపీ అన్ని రకాల ప్రయత్నం చేస్తోందని... అందులో భాగంగానే రాహుల్‌పై అనర్హత అని మండిపడ్డారు. అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. ప్రధాని మోదీ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.ఇలాంటి వైఖరి దుర్మార్గమని అన్నారు. కోర్ట్ 30 రోజులు అప్పీల్‌కు టైం ఇచ్చిందని.. అలాంటప్పుడు అనర్హత వేటు ఎందుకు అని ప్రశ్నించారు. మోదీ కాల గర్భంలో కలిసిపోతారని శాపనార్థాలు పెట్టారు. రాహుల్‌కు తాము అంతా అండగా ఉంటామని తెలిపారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేసిన పాదయాత్రలో ప్రభుత్వ వైఫల్యాలను రాహుల్ ఎండగట్టారని.. దాన్ని మోదీ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మోదీ కలియుగ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఘనంగా ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం..

చండ్రుగొండ మార్చి 24( విజయం న్యూస్):

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానవ హారం,ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజ మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలించాలని ,మనందరి (పంతం టీబీ అంతం) ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు .అలాగే ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యసభ సభ్యులు పార్థసారథి రెడ్డి పంపించిన న్యూట్రిషన్ ఫుడ్ కిట్స్ చండ్రుగొండ మండలం పరిధిలోని టిబి పేషంట్ లకు న్యూట్రిషన్ కిట్స్ లు పంపిణీ చేయడం జరిగినది. ఈ



కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ శంకరమ్మ, అనిత, హెల్త్ సూపర్ వైసర్ లు ఇమామ్, చంద్రకళ, ఫార్మాసిస్ట్ లక్ష్మీ, ఎంఎల్ హెచ్ పి లు యస్మిన్,షాభిహా, రమ్య, కిరణ్, పద్మ, జ్యోతి,పుల్లమ్మ, రమణమ్మ,సుజాత, ఎస్ . సునీత, లక్ష్మీ దేవి, సక్కుబాయ్, చంద్రకళ, ఏఎన్ఎం లు,డి ఈ ఓ ప్రశాంత్,ఆశాలు, సిబ్బంది, పాల్గొన్నారు



# పంచాయితీ విధులకు బహుమతి ప్రధానం

ములుగు/నూగూరు వెంకటాపురం/మార్చి 24(విజయం న్యూస్):

ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటాపురం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలు నిర్వర్తించిన విధులకు గాను ప్రతి పంచాయతీకి బహుమతులను శుక్రవారం అందజేశారు. పలు కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఐదు పంచాయతీలు ఎదిర, సూరవీడు, రాసుపల్లి, మర్రిగూడెం, బెస్త గూడెం లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు పాయం రమణ, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, తహశీల్దార్ అంతి నాగరాజు, ఎంపీడీవో అడ్డూరి బాబు, సిడిపిఓ ముత్తమ్మ, ఎంపీఓ హనుమంతరావు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు..

చండ్రుగొండ మార్చి 24(విజయం న్యూస్)

గ్రామీణ పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని ఎంపీపీ బానోత్ పార్వతి,జెడ్పిటిసి కొళకండ్ల వెంకటరెడ్డి లు స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ 2021-22 అవార్డుల ప్రధానోత్సవం లో పాల్గొని, పంచాయతీ సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి,ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ... మండలంలోని 14 పంచాయతీలలో జాతీయస్థాయి అవార్డులు రావడం అభినందనీయమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పనిచేసి అవార్డులు వచ్చేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఏపీవో తోట తులసీరామ్, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీటీసీలు,సర్పంచులు దారా వెంకటేశ్వర్‌రావు, లంకా విజయలక్ష్మి, పూసం వెంకటేశ్వర్లు, ఇర్ప లక్ష్మీపతి, ఇస్లావత్ నిరోషా, గుగ్గులోత్ బాలాజీ, బానోత్ కుమారి, కాకా సీత , బానోత్ రన్యా, బాబురావు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు వంకాయలపాటి బాబురావు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అధికారం ఉందని విర్రవిగుతున్నారు..!

- త్వరలోనే వడ్డీతో సహా ప్రతిఒక్కరి లెక్క తేలుస్తా...!!
- టీఎస్పీఎసీ పేపరు లీకేజీతో 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు
- ప్రభుత్వమే నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తుంది
- ఎంతోమంది అమరుల ఆత్మబలిదానాల పుణ్యమే తెలంగాణ
- ప్రొఫెసర్ కోదండరామ్, నాలాంటి వారు లొంగలేదనే మాపై ఈ కక్ష సాధింపులు
- త్వరలోనే రైట్ ఛాయిస్ సహకారంతో ఉమ్మడి జిల్లాలో జాబ్ మేళా ఏర్పాటు చేయిస్తా
- నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు పూయిస్తా...అధైర్యపడొద్దు అండగా ఉంటా
- రైట్ ఛాయిస్ నిరుద్యోగుల అవగాహన సదస్సులో మాజీ ఎంపీ పొంగులేటి

**(భద్రాద్రికొత్తగూడెం-విజయంన్యూస్):** అధికారం ఎవడబ్బా సొత్తు కాదు...అధికారం ఉందని ఈరోజు కొందరు విర్రవిగుతున్నారు... అది శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తెరగాలి... రాబోయే రోజులన్ని మనవే... అధికారంతో విర్రవిగే ప్రతి ఒక్కరి లెక్కను త్వరలోనే వడ్డీతో సహా తేలుస్తానని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్ లో రైట్ ఛాయిస్ అకాడమీ ఛైర్మన్ మెండెం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నిరుద్యోగుల అవగాహన సదస్సులో పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుమారు మూడు వేల మందికి పైగా నిరుద్యోగులు పాల్గొన్న ఈ సదస్సును ఉద్దేశించి పొంగులేటి మాట్లాడుతూ టీఎస్



పీఎస్ సీ పేపరు లీకేజీతో రూ.30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపించారు. ఈ కేసులో ప్రభుత్వానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర కూడా ఉందని, వారిని ప్రభుత్వమే రక్షించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఎంతోమంది అమరుల ఆత్మబలిదానాల పుణ్యమే తెలంగాణ అన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ సహా నా లాంటి వారు ఎందరో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందు వల్లనే మా పై ఈ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఎలాగు ఈ ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదు. కావున తన ఆధ్వర్యంలోనే రైట్ ఛాయిస్ మెండెం కిరణ్ కుమార్ సహకారంతో ఉమ్మడి జిల్లాలో జాబ్ మేళాలను ఏర్పాటు చేయిస్తా... నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు పూయిస్తా... శీనన్న హామీ ఇస్తున్నాడు... అధైర్యపడొద్దు ధైర్యంగా ఉండండి... ఖచ్చితంగా ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి కంటితుడుపు చర్యగా నామమాత్రపు నష్టపరిహాన్ని ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. రాబోయే రోజులన్ని మనవే నని ప్రతిఒక్కరు ధైర్యంగా ఉండాలని మరోసారి నిరుద్యోగులకు భరోసా ఇస్తూ పొంగులేటి ప్రసంగించారు.




# కేసీఆర్ మోసపూరిత పర్యటన "సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ"

**తిరుమలాయపాలెం, మార్చి 24 (విజయం న్యూస్)**

తిరుమలాయపాలెం మండల పరిధిలోని తిప్పారెడ్డి గూడెం గ్రామంలో శుక్రవారం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మోసపూరితమైన పర్యటన చేస్తూ మరో సారి రైతాంగాన్ని మోసం చేయాలని చూస్తున్నాడని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు అన్నారు. పార్టీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల అకాలంగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని, రైతులు పూర్తిగా నష్టపోయారని గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలోని బోనకల్ మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలు పరిశీలించి అక్కరకురాని పంటనష్టం పదివేల రూపాయలను ప్రకటించడం విడ్డూరమన్నారు. ఒక్కో ఎకరానికి లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టి రైతన్నలు పంటలు సాగుచేస్తుంటే, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు పంటనష్టపరిహారం అందిస్తామని కంట తుడుపుగా హామీ ఇచ్చినట్లుగా ఉన్నదని ఆరోపించారు. ముఖ్యమంత్రి హామీని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఖండిస్తుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు వర్షానికి దెబ్బతిన్న పంటలు సర్వేచేసి, ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం అందించాలని%బ% డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్, నాయకులు అచ్చా ఉప్పలయ్య, గొర్రెపాటి వీరస్వామి, పోలేపొంగు నాగయ్య పేరం వెంకటేశ్వర్లు ఏ బ్రహ్మచారి, మల్సూరు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు

# 1/70, ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

## లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు నాయక్

**కామేపల్లి మార్చి 24(విజయం న్యూస్)**

ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఉన్న గ్రామాలలో1/70 పీసా చట్టాలకు అధికారులు పటిష్టంగా అమలు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి కామేపల్లి మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతర్లు ఉన్న మత్స్య సహకార సొసైటీలను రద్దుచేసి అట్టి ఖాళీలను గిరిజనులచే భర్తీ చేసి గిరిజనులకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను గిరిజనులకు అందేలా చూసి వారి జీవనోపాధికి తోడ్పాడాలని కామేపల్లి మండల లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. కామేపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చేపల చెరువులలో సభ్యత్వం గిరిజనులచే భర్తీ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సొసైటీ చెరువులతో పాటు ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 268 ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ఉన్న చిన్న చెరువుల నీటి విస్తరణాన్ని పరిగణలోకి తీసుకొని అట్టి ఖాళీలను కూడా గిరిజన మత్స్యకారులకు కేటాయించాలి గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా ఆందోళన నిర్వహించి హక్కులను కాపాడుకుంటామని ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు తెలియజేశార్ను. ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న చట్టాలను ఉల్లంఘించి పనిచేసే ఎంతటి అధికారులను కూడా ఉపేక్షించమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుతు లక్ష్మ బోడ శంకర్ గుగులోతు కిషన్ రవి రమేష్ వెంకన్న శ్రీను రాము బావ సింగ్ లాలు తదితరులు పాల్గొన్నారు.



# ట్రైకార్ పథకం క్రింద మంజూరైన యూనిట్ల గ్రౌండింగ్ చేయండి

## సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్

**ఖమ్మం, మార్చి 24(విజయంన్యూస్):** ట్రైకార్ పథకం క్రింద మంజూరైన యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, బ్యాంకర్లతో ట్రైకార్ యూనిట్ల గ్రౌండింగ్ పై భద్రాచలం ఐటీడీఏ పీవో గౌతమ్ పోట్రూ తో కలిసి, కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన యువత స్వయం ఉపాధికి, ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు ట్రైకార్ క్రింద సబ్సిడీ తో యూనిట్ల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక మద్దతు పథకం క్రింద 451 యూనిట్ల లక్ష్యం కాగా, 221 యూనిట్లు ఇప్పటి వరకు మంజూరు కాగా, ఎంపిడిఓ వద్ద 25, బ్యాంకర్ల వద్ద 28 ఉండగా, పరిపాలనా అనుమతుల కొరకు 198 యూనిట్లు సమర్పించినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ రవాణా ప్రణాళిక క్రింద 62 యూనిట్ల లక్ష్యం ఉండగా 55 యూనిట్లు మంజూరు చేశామన్నారు. 53 యూనిట్లకు సబ్సిడీ విడుదల చేయగా, ఇప్పటి వరకు 41 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తయినట్లు ఆయన తెలిపారు. మిగులు యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రౌండింగ్ పూర్తయిన యూనిట్లకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. లబ్ధిదారులు యూనిట్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి, శిక8సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీవో విద్యాచందన, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కృష్ణా నాయక్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, బ్యాంకర్లు పాల్గొన్నారు.



# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

- పెద్ద ఎత్తున తరలి వచ్చిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు
- ఎమ్మెల్యే రాములు నాయక్, ఎమ్మెల్సీ తాతా మధుని ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు
- తెలంగాణ ఉద్యమకారులకు ఘనంగా సన్మానం
- సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు చెక్కులు పంపిణీ




**కారేపల్లి మార్చి24 (విజయం న్యూస్):**

కారేపల్లి మండలం పేరేపల్లి గ్రామంలో వైరా శాసనసభ్యుల లావుడియా రాములు నాయక్ నాయకత్వంలో కారేపల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పేరేపల్లి, మాధారం, గుంపెళ్ల గూడెం, కొత్త తండా, మంగలి తండా, రావొజి తండా, భాగ్యనగర్ తండా, గుట్టకింద గుంపు, పోలంపల్లి, ఉసిరికాయలపల్లి పది పంచాయితీల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ హాజరయ్యారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడుతూ..**

కేసీఆర్ నాయకత్వం దేశానికి అవసరం ముందుగా బిఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పంపిన సందేశాన్ని పార్టీ శ్రేణులకు చదివి వినిపించారు. గడపగడపకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు, బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన సందేశం కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపింది. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటాం, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతమైన ప్రచారం నిర్వహించాలి, దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు తెలంగాణలో ప్రతి గడపకు కేసిఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులందరూ నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. మన భారాస ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు వివరించాలి. గ్రామాల వారిగా మన ప్రభుత్వ పథకాలను లబ్ది పొందుతున్న లబ్ది దారులను గుర్తించి వారిని కలిసి వారికి వివరించాలి. పార్టీని బూతు స్థాయి నుండి బలోపేతం చెయ్యాలి, కెసిఆర్ సారథ్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్క కార్యకర్తను బిఆర్ఎస్ పార్టీ గుర్తిస్తుందన్నారు. కార్యకర్తలను ప్రతి ఒక్కరినీ కంటికి రెప్పల కాపాడుకుంటానన్నారు.

**ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ..**

ఎమ్మెల్యే రాములు నాయక్ నాయకత్వంలో వైరా మళ్ళీ బిఆర్ఎస్ గెలుస్తుందన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఎవరు ఎప్పుడు ఎక్కడ చేయలేని విధంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున హుస్సేన్ సాగర్ దగ్గర 125 అడుగుల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి కాంస్య విగ్రహాన్ని ఏప్రిల్ 14న ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించబోతున్నామన్నారు. ఏప్రిల్ 30న తెలంగాణ రాష్ట్ర పరిపాలన నూతన అంబేద్కర్ సచివాలయాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ దేశంలో ఒక గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడం జరిగింది అని ఆయన అన్నారు. ఆనాడు ఎలాగైతే ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విప్లవాత్మక పంథాను అనుసరించారో. అలాగే ఈనాడు దేశహితం కోసం నూతన రాజకీయ ఒరవడిని కేసీఆర్ ప్రారంభించడం జరిగింది అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ, ప్రగతి విధానాలు బీఆర్ఎస్ వేదికగా దేశం మొత్తానికి అమలు చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు పూర్తిస్థాయిలో మెజార్టీ సీట్లు వచ్చే అవకాశం లేదని సర్వేలు చెప్తున్నాయని దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రాంతీయ పార్టీలతో బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే చర్చలు జరిపారని అనేక మంది హేమాహేమీ నేతలు సీఎం కేసీఆర్ ఆలోచనలతో ఏకీభవించారని, కలిసివచ్చేందుకు ఆసక్తిచూపుతున్నారని దేశంలో రాబోయే రోజుల్లో గుణాత్మక మార్పుకు బీఆర్ఎస్ నాంది పలుకుతుంది అన్నారు. తెలంగాణ రాకముందు తెలంగాణ వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి ఒకసారి చర్చించుకోవాలని అన్నారు. నిరంతరం గ్యాస్ ధరలు పెంచుతూ పెట్రోల్ ధరలు పెంచుతూ పేదోళ్ల నడ్డి విరుస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బిజెపి నాయకులు కాంగ్రెస్ నాయకులను ప్రజలు తరిమికొట్టాలి అన్నారు 60 ఏళ్ల పరిపాలనలో చేయలేని కాంగ్రెస్ ఇప్పుడు చేస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల వైసీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, దిశా కమిటీ సభ్యులు సర్పంచ్ బాణోత్ కుమార్, సొసైటీ డైరెక్టర్ లు మర్శకట్ల రోశయ్య, డేగల ఉపేందర్, ఏఎంసి డైరెక్టర్ వాంకుడొత్ నరేష్, సర్పంచ్ లు అజ్మీర నాగేశ్వరరావు, బాణోత్ పద్మ, మాలోత్ కిశోర్, పిల్లమర్రి స్వర్ణ, ఎట్టి రజిని, గుగులోత్ సకృ, , ఎంపీటీసీలు భాగం రూప, ధరవత్ అచ్చమ్మ, సోని జంలా, నాయకులు, ముత్యాల సత్యనారాయణ, అజ్మీర వీరన్న, భాగం నాగేశ్వరరావు, అడపా పుల్లారావు, నర్సింగ్ శ్రీనివాస్ ధరావత్ బత్తుల బత్తుల శ్రీనివాస్, ముత్యాల వెంకట అప్పారావు, ఎర్రబెల్లి రఘు, బాణోత్ కోటి, గుగులోత్ హారు, భూక్య మోతిలాల్, బాణోత్ మంగిలాల్ నాయక్, జాల సాంబ, బాణోత్ చక్రం, బాణోత్ చింటూ, అదేర్ల రామరావు, మండల అనుబంధం సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరిశ్చంద్రాపురంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట

### జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్



**కామేపల్లి మార్చి 24 (విజయం న్యూస్)**

కామేపల్లి మండలం హరిశ్చంద్రాపురం గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు, అభయాంజనేయ స్వామి దేవతల విగ్రహాలు అంగరంగ వైభవంగా పచ్చని తోరణాల మధ్య, బ్రహ్మశ్రీ వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల చేత శాస్త్రోక్తంగా వైభవంగా, ప్రతిష్ఠించడం జరిగింది. విశేష ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, భద్రాద్రి జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విశేషంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన తెలంగాణ పల్లె లల్లో ప్రతి గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ దేవతలని ప్రతిష్టించుకోవడం మన తెలంగాణ సంస్కృతికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఆ దేవతల చలవవల్ల గ్రామాలు ప్రశాంతంగా, పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉంటున్నాయని తెలిపారు. విగ్రహాల ప్రతిష్ట కొరకు విరాళాలు ఇచ్చిన దాతలు ముఖ్యంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని వృద్ధులు మహిళలు యువకులు ఉత్సాహంతో భారీ ఎత్తునపాల్గొన్నారు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంతోటి అచ్చయ్య, సర్పంచ్ రాందాస్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల,ప్రసాదు, సుశీల, సాంబ,గ్రామ పెద్దలు రాందాస్,బన్సీ భాస్కర్ లాలు బాదావత్ నాగరాజు రాంజీ , రమేష్, దశరథ్, రామ్ సింగ్ రమేష్, లాల్ సింగ్,, ధర్మ దేవా,బద్రు శంకర్ మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## పప్పులతోనే బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం

**కామేపల్లి మార్చి24 (విజయం న్యూస్)**

చిరుధాన్యాలు, పప్పులు వాడకంలో అనేక ప్రయోజనాలు ఉన్నాయని గర్భిణీ స్త్రీలు, బాలింతలు కు వీటిని వాడకం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గరిడేపల్లి సర్పంచ్ ధారావత్ రాంజీ, ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు సందర్భంగా గరిడేపల్లిలో అంగన్వాడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. అలాగే వాటి వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జమున, బుజ్జి, ఆయాలు పాఠశాల ఉపాధ్యాయులు దేవా సింగ్, బి శ్రీనివాసరావు పంచాయతీ సెక్రటరీ రాజకుమార్. బాలింతలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



## జోడ యాత్రలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని పిలుపు...

**మణుగూరు మార్చి 24(విజయం న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పులిపాటి పాపారావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గురజాల గోపి మాట్లాడుతూ ఈనెల 26న ఆదివారం ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో కేంద్ర మాజీ మంత్రివర్యులు రేణుక చౌదరి అధ్యక్షతన హాత్ సే హాత్ జోడోయాత్ర, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు .ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జి మాణిక్రావు టాకీస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఏఐసీసీ కార్యదర్శి రాహుల్ చౌదరి నజీమ్ జావిద్ పాల్గొంటారు. ఆదివారం జరిగే జోడో యాత్రను భారీ బహిరంగ సభను లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కంప రవి ఆఫీస్ ఇంచార్జ్ ఎండి షరీఫ్ యువజన నాయకులు మోహన్ పాల్గొన్నారు.

## మరోసారి దాతృత్వాన్నిటిన సర్పంచి జాటోత్ లూసీ

**కామేపల్లి మార్చి 24(విజయం న్యూస్)**

పజాసేవలో అనునిత్యం శ్రమిస్తూ ముచ్చర్ల పంచాయతీని అభివృద్ధిపథంలో నడిపిస్తూ ఆదర్శంగా ముందుకు సాగుతున్న సర్పంచి జాటోత్ జాయ్ లూసీ మరోసారి మంచి మనసును చాటుకున్నారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని కుంటలో శుక్రవారం పలువురు నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.



# బావకు సీటొచ్చిన కలిసి పనిచేస్తాం..




(కూసుమంచి-విజయం న్యూస్)

రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో పోటీ చేసేది సీపీఎం పార్టీనా..? బీఆర్ఎస్ పార్టీనా..? కందాళ ఉపేందర్ రెడ్డి పోటీ చేస్తారా..? సీపీఎం పార్టీ పోటీ చేస్తుందా..? అని అందరు తమ లెక్కలు వేసుకుంటన్నారు. ఇది సాహజం.. రాబోయే ఎన్నికల్లో సీపీఎం పార్టీకి పాలేరు టిక్కెట్ కావాలని, ప్రథమ స్థానంలో పాలేరు నియోకవర్గాన్ని పెట్టింది వాస్తవం.. సీపీఎం, బీఆర్ఎస్ పొత్తుల్లో పాలేరు నుంచి ఏదైనా జరగోచ్చు.. కానీ సీపీఎం పార్టీ నుంచి ఒక్కటి చెబుతున్నా... బావకు(కందాళ ఉపేందర్ రెడ్డి) టిక్కెట్ వస్తే ఎర్రజెండా పక్షాన మా తలమీద పెట్టుకుని నియోజకవర్గం మొత్తం తిరిగి గెలిపించే బాధ్యత నాది..మాది.. అలాగే సీపీఎం పార్టీకి టిక్కెట్ వస్తే కచ్చితంగా బావ(కందాళ ఉపేందర్ రెడ్డి) మా పార్టీ గెలుపుకోసం తనవంతు ప్రయత్నంగా మాతో నిలబడి నియోజకవర్గం మొత్తం తిరిగి ప్రచారం చేసి గెలిపిస్తారనే నమ్మకం నాకుంది. మాలో వర్గాలు లేవు.. మాలో తారతమ్యాలు లేవు.. ఈ మాట బావ ఎప్పుడో చెప్పారు. మేమంతా కలిసే ఉన్నాం.. మీరు కలవండి.. ఐక్యంగా పోరాడదాం.. ఖమ్మం జిల్లాలో పదికిపది స్థానాలను గెలిపించుకుందామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాఫిక్ గా మారాయి.. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జనచైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా తిరుమలాయపాలెం మండలం అనంతరం కూసుమంచి మండల కేంద్రానికి వచ్చిన యాత్రకు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రంను, పోతినేని సుదర్శన్ రావును సీపీఎం పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీజెపి మతోన్మాద కార్పొరేటు విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మతసామ్రాశ్యం, సామజిక న్యాయం, ప్రజా స్వామ్యం కోసం సీపీఐఎం అఖిల భారత పిలుపులో భాగంగా తెలంగాణ రాష్టంలో 2023 మార్చి 17నుండి 29వరకు జరుప తలపెట్టిన జన చైతన్య యాత్ర లో భాగంగా శుక్రవారం కూసుమంచి మండల కేంద్రంలో సిపిఐ, సిపిఎం ఇరు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన జన చైతన్య యాత్ర కు యడవల్లి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ....భారతదేశానికి బిజెపి కార్పొరేట్ విధానాలు అత్యంత ప్రమాదకరంగా మారి సామాన్యుడు ఈ దేశంలో వ్యవసాయం గాని , వ్యాపారం గాని నిర్వహించుకునే పరిస్థితి లేదన్నారు. సంక్షేమ పథకాలు తుంగలోకి తొక్కి మతోన్మాద విధానాలను ముందుకు తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ప్రధాని మోడీ తను అధికారంలోకి రాకముందు చెప్పిన మాటలను, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటి కూడా నెరవేర్చక పోగా అనేకమంది రైతులను నల్ల చట్టాల పేరుతో హతమార్చిన సంఘటనలు దేశంలో అనేకం ఉన్నాయన్నారు. బిజెపి ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే పనిచేస్తూ రైల్వే, బొగ్గు, ఎల్ఐసి ఎలక్ట్రిసిటీ మొదలైన వాటిని లాభాల్లో ఉన్న వాటిని నష్టాల్లో చూపుతో కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందన్నారు. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక దేశంలో 16 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని హేళన చేస్తూ రాజ్యాంగ విలువలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి దేశంలో, రాష్ట్రంలో మత చిచ్చులు కల్లోహాలు సృష్టించడంలో రాద్దు తేలిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని భూస్థాపితం చేస్తామన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా సిపిఎం పని చేసిందని ,ప్రస్తుతం కూడా పని చేస్తుందని, బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు తెస్తే దానికి వ్యతిరేకంగా కూడా భవిష్యత్తులో పోరాటం చేస్తామన్నారు.

### పాలేరులో ఎవరు పోటీలో ఉన్నా సమ్మతమే

ఈ సందర్భంగా సభ మధ్యలో సంఘీభావం తెలపడానికి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ని ఉద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ.. పాలేరు ఎమ్మెల్యేగా సిపిఎం పోటీ చేస్తుందా? బీఆర్ఎస్ పార్టీ పోటీ చేస్తుందా? అని ప్రజల్లో కార్యకర్తల్లో అనేక చర్చోపచర్చలు జరుగుతున్నాయని, ఈ జరిగే చర్చలు అన్నీ వాస్తవాలే అయినప్పటికీ ఇప్పుడు అవి అప్రస్తుతం అని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం వామపక్ష పార్టీలు బీఆర్ఎస్ పార్టీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని, ఒకవేళ అటువంటి పరిస్థితుల్లో పాలేరు టికెట్టు బిఆర్ఎస్ కు వచ్చినా కందాల ఉపేందర్ రెడ్డిని తన భుజాలపై కూర్చోబెట్టి ఎర్రజెండా చేత పట్టి ఊరురా తిరిగి ప్రచారం చేసి ఉపేందర్ రెడ్డిని గెలిపిస్తామని, ఒకవేళ సిపిఎం పాలేరు నుంచి పోటీలో ఉంటే బీఆర్ఎస్ పార్టీ కూడా అదే తరహాలో మాకు సహకరించాల్సి ఉంటుందని అన్నారు.

### సంఘీభావం తెలిపిన పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి

మండల కేంద్రంలో సిపిఎం పార్టీ నిర్వహించిన జన చైతన్య యాత్రకు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి తమ సాంఘిభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాళ మాట్లాడుతూ.. సిపిఎం పార్టీ తలపెట్టిన జనచైతన్య యాత్ర ఉద్దేశాలు లక్ష్యాలు చాలా బాగున్నాయని వీటిని మరింతగా ముందుకు తీసుకుపోవాలని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టిఆర్ఎస్ పార్టీ పదికి పది సీట్లు గెలిపించడమే లక్ష్యంగా పనిచే పని చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్, సిపిఎం ఖమ్మం జిల్లా నున్న నాగేశ్వరరావు , మహాలక్ష్మి బుగ్గవీటి సరళ, శ్రీకాంత్ మాదినేని రమణ, పాల్గొనగా బీఆర్ పార్టీ నుండి పాలేరు ఎమ్మెల్యే తో పాటు స్థానిక ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వేముల వీరయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చాట్ల పరశు రాం,కొక్కిరేణి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనదే ప్రభుత్వ లక్ష్యం

(రఘునాథపాలెం, ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే జీవోనెంబర్ 58,59కింద నిరుపేదలకు స్థలాలకు పట్టాలివ్వడం జరుగుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. పేదలకు లబ్ధిచేకూరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్.58%ం% 59 పథకం క్రింద దరఖాస్తు చేసుకుని మంజూరైన ఇళ్ళ



పట్టాలను లబ్ధిదారులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం నగరం ఎల్.బి నగర్ నందు పేదలకు జీవో నెంబర్.58 %ం% 59 పథకం క్రింద 406 మందికి మంజూరైన ఇళ్ల పట్టాలు మంత్రి పువ్వాడ పంపిణీ చేశారు. 8వ డివిజన్ లో 253, 14వ డివిజన్ లో 122, 15వ డివిజన్ లో 23, 8 మొత్తం 406 పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్.58 %ం% 59 పథకం పేదలకు వరంలాంటిది అన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అయినా పేదలు నివాసం ఉంటున్న చోటే ఇంత పెద్ద ఎత్తున పట్టాలు ఇచ్చిన ప్రభుత్వంను చూసారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని మీ ఇంటి గడపకు అందిస్తున్నామని, ఇక్కడ ఉన్న ప్రతి పేద ఇల్లు నేడు ప్రభుత్వం పథకం అనుభవిస్తున్నారని అన్నారు. మిషన్ భాగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరు అందిస్తున్నామని అన్నారు. కనీసం త్రాగడానికి నీరు లేకుండా కిలోమీటర్ల నుండి నీరు తెచ్చుకునే పరిస్థితి నుండి నేడు మీ వద్దే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగునీరు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. పేదవాళ్ళు పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్దితో ఉంది కాబట్టే నేడు ఖమ్మం కార్పోరేషన్ వ్యాప్తంగా లక్షల విలువైన భూములను పేదలకు ఇస్తున్నామని, అట్టి ఇంటికి స్థలంకు పట్టాలు ఇచ్చామన్నారు. వివిధ కారణాలతో ఇంకా ధరఖాస్తు చేసుకొని వారు ఉంటే తక్షణమే ధరఖాస్తు చేసుకోవాలని, జీవో నెంబర్ 58 %ం%59 పథకాన్ని పొడిగించడం జరిగిందని ఏప్రిల్ 1వ తేదీ నుండి 30 వరకు దరఖాస్తు చేసుకొవొచ్చు అని సూచించారు. అర్హులైన వారు ఎంత మంది దరఖస్తు చేసుకున్నా అందరికీ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే అనేక పథకాలు రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారని, మహిళల పేరుతోనే కళ్యాణలక్ష్మీ చెక్కులు, కేసీఆర్ కిట్స్, ఇళ్ళ పట్టలు, ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రానున్న రోజుల్లో సొంత జాగా ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం తరుపున రూ.3లక్షలు కూడా ఇప్పిస్తామని హామి ఇచ్చారు.

### అర్చ్ ప్రారంభించి, బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన మంత్రి పువ్వాడ..

8వ డివిజన్ నందు నూతనంగా నిర్మించిన పువ్వాడ అజయ్ నగర్ పేరున నిర్మించిన ఆర్చ్ ను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ దిమ్మె, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్డీవో రవీంద్రనాథ్, కార్పొరేటర్ రాపూరి కరుణ, కూరాకుల వలరాజ్,ఏఎంసీ ఛైర్మన్ శ్వేత, సుడా ఛైర్మన్ విజయ్, తహశిల్దార్ శైలజ, నాయకులు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, దేవబక్తుని కిషోర్ బాబు, గొల్లపూడి రాంప్రసాద్, గొల్లపూడి హరికృష్ణ, సురేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపీ నామ పర్యటన

ఖమ్మం, మార్చి 24(విజయంన్యూస్):

బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు శని ఆదివారాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటారని ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం మధిర పట్టణంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నామ పాల్గొంటారు.మున్సిపల్ ఆఫీస్ బిల్డింగ్, అంబేద్కర్ భవన్, డంపింగ్ యార్డ్, సిసి రోడ్ల శంకుస్థాపన తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో నామ పాల్గొంటారని క్యాంప్ కార్యాలయం తెలిపింది. అలాగే జులూరుపాడు లో జరిగే పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు.ఈ సందర్భంగా నేలకొండపల్లి లో జరిగే సీపీయం జన చైతన్య యాత్రలో కూడా నామ పాల్గొని సంఘీభావం తెలుపుతారు.ఆదివారం ఉదయం నెహ్రూనగర్ లోని స్వగృహంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు నామ నాగేశ్వరరావు అందజేస్తారు. అనంతరం ఖమ్మం టూ టౌన్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో నామ పాల్గొంటారు.పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీ క్యాంప్ కార్యాలయం కోరింది.

# ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఓ బూటకం

## జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, జావేద్




(ఖమ్మంప్రతినిధి-విజయం న్యూస్)

పంట నష్టంపై ప్రభుత్వం ప్రకటించిన పరిహారం బూటకమని రైతులు పెట్టిన పెట్టుబడికి ఎటూ సరిపోదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ తో కలిసి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రైతు పెట్టిన పెట్టుబడిలో కనీసం 50శాతం నష్టాన్ని ప్రభుత్వం భరించలేక పోవడం సిగ్గు చేటని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 10వేలతో ఒక్క సారి దుక్కి దున్నడానికి సరిపోదని విమర్శించారు. కేసీఆర్ కు నిజంగా రైతులపై ప్రేమ ఉంటే కౌలు రైతులకూ రైతు బంధు వర్తింప జేస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగ రైతులపై బ్యాంకర్ల దాడులు పెరిగాయని, రైతుల ఇండ్లకు వెళ్లి రుణాలు కట్టాలని వేదిస్తు ఇండ్లకు తాళాలు వేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ ప్రకటనలకే పరిమితం అవుతుందని ఇంత వరకూ రుణ మాఫీపై స్పష్టత లేదని అన్నారు. ఖమ్మం మిర్చీ మార్కెట్ లో దళారుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని రైతలను నిలువునా దోచుకుంటున్నారని అన్నారు. ఇటీవల కాలంలో స్థానిక మంత్రే స్వయంగా క్వింటకు 25వేల రూపాయలుగా జెండా పాట ప్రకటించి అందరి దగ్గర అదే ధరతో కొంటామని చెప్పి 15 నుండి 17వేలకు మాత్రమే కొనుగోలు చేయడం రైతులను మోసం చేయడం కాద అని ప్రశ్నించారు. మంత్రి పర్యటించిన తర్వాతే మార్కెట్లో దళారులు రెచ్చి పోతున్నారని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నేత ఎమ్మెల్సి తాత మధు సుధన్ సోయి లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న మా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కని విమర్శించే స్థాయి ఆయనకు లేదని హితవు పలికారు. సీఎల్పీ నేతగా రాష్ట్రమంతా తిరిగే అర్హత మల్లు భట్టి విక్రమార్క కు ఉందని ఈ మాత్రం జ్ఞానం లేకుండా విమర్శించడం సిగ్గు చేటని అన్నారు. పదవులు కొనుక్కునే వారు ప్రజా నాయకులను విమర్శించే ముందు ఆలోచించి మాట్లాడాలని ఎద్దేవా చేశారు. చేత నైతే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ని సత్తా ఏంటో తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా పర్యటనకు రావడానికి కారణం కూడా మల్లు భట్టి విక్రమార్కే అని అన్నారు. మా నాయకుడు సీఎల్పీ నేత పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటించి బాధితులను పరామర్శించి బాధితుల పక్షాన పోరాటం చేయబట్టే సీఎం ఫాంహౌస్ విడిచి వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ను విమర్శించే ముందు ఆలోచించి మాట్లాడాలని అన్నారు. గత ఏడాది గోదావరి పరివాహక జిల్లాలో ప్రకటించిన 10వేల పరిహారం ఇంకా పూర్తి స్థాయిలో లబ్ధి దారులకు అందలేదని బోనకల్ లో ప్రకటించిన పరిహారం అలా చేస్తే కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

## విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ తాతామధు

(ఖమ్మంప్రతినిధి, రఘునాథపాలెం-విజయంన్యూస్)

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మధిర నియోజకవర్గ ఇంచార్జ్ జెడ్పీ చైర్మన్ కమల్ రాజు అన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరిగిన రైతులకు అండగా నిలిచేందుకు జిల్లా పర్యటన చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి మీడియా సమావేశం వేదికగా కృతజ్ఞతలు తెలిపిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాల వల్ల పంట నష్టం జరిగితే గతంలో ఏ ముఖ్యమంత్రి పర్యటించని విధంగా రైతుల పక్షపాతి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకే రోజులో రాష్ట్రంలోని నాలుగు జిల్లాలు పర్యటించి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పర్యటన భాగంగా రైతుల జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించి రైతులకు అండగా నిలిచే విధంగా ఎకరానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం పట్ల ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ జిల్లా రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తంచేశారు. రైతు సంక్షేమ ప్రతినిధిగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని కేసీఆర్ రైతు పాలనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పంట నష్టం పై స్పందించిన తీరుతో ప్రతిపక్షాలు



జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో రైతుల దుస్థితి ఏమిటో యావద్ దేశ ప్రజలకు తెలుసునని రైతుల జీవితాలను ప్రైవేటీకరణ చేసే దురుద్దేశంతో బిజెపి పన్నుతున్న కుట్రలు ఫలించవని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో పేరుకు మాత్రమే సహాయంగా ప్రకటనలు కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా నిలిచేందుకు పదివేల ఆర్థిక సహాయం ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల ఎకరానికి రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానిది. వ్యవసాయం చేసే ఏ రైతు నష్టపోవద్దని ఉద్దేశంతో పంటకు పెట్టుబడి పెట్టిన కౌలు రైతులకు సైతం పదివేల రూపాయల ఆర్థిక సాయం నేరుగా అందజేసే విధంగా ఆదేశాలు జారీ చేయడం పట్ల కౌలు రైతుల తరపున కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర్లు, జిల్లా యువజన అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య, తెలంగాణ ఉద్యమకారులు దోకుపర్తి సుబ్బారావు, నాయకులు శీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ మాటలన్నీ పచ్చి అబద్దాలే

- గోబెల్స్ బిరుదు అర్హుడు సీఎం కేసీఆర్
- నష్టపరిహారం ఇచ్చే రూ.10వేలలో కేంద్రం వాటా ఎంత..?
- తెలంగాణ రైతులను పట్టపగలే పంగనామాలు పెడుతున్న సీఎం
- రైతులను తక్కువ అంచన వేయొద్దు..
- విలేకర్ల సమావేశంలో కెసిఆర్ ఖమ్మం పర్యటన పై మండిపడిన బీజేపీ నేతలు



(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

పంట నష్టపరిహారం చెల్లించే విషయంలో సీఎం కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడని, ఆయన తెలంగాణ గోబెల్స్ బిరుదుకు పూర్తి అర్హుడని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సీఎం కేసీఆర్ పై మండిపడ్డారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఖమ్మం పర్యటన, రైతులను పరామర్శించడానికా? కేంద్ర ప్రభుత్వం పైన మోడీ పైన విషం చిమ్మడానికా? అని అన్నారు. బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి కెసిఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని, తెలంగాణ గోబెల్స్ బిరుదు కేసీఆర్ కు సరిగ్గా సరిపోతుందని విమ్మర్శించారు. కేంద్రాన్ని అడక్కుండా ఎకరానికి రూ. 10వేలు ఇస్తానన్న కేసీఆర్ ఎస్డీఆర్ఎఫ్ నిధుల్లో కేంద్రం వాటా ఎంతో చెప్పాలి? ఎస్డీఆర్ఎఫ్ నిధుల్లో 75 శాతం కేంద్రం నిధులు సమకూరుస్తుందన్నారు. తెలంగాణ రైతులు అమాయకులు కారు అనే విషయాన్ని కేసిఆర్ గ్రహించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయని కెసిఆర్ అహంకారానికి తెలంగాణ రైతులు బలవుతుందన్నారు. ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని అన్నారు. ఎవరు సన్నాసులో ఎవరు సన్యాసులో రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. తెలంగాణ లో కెసిఆర్ పాపాల కోటా పూర్తయిందన్నారు. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో బీఆర్ఎస్ పాలనకు ప్రజలే చరమగీతం పాడుతారు.

## - బీజేపీ కిసాన్ మోర్చా పోరాటఫలితమే : బిజెపి జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

బిజెపి కిసాన్ మోర్చా పోరాట ఫలితంగానే ప్రగతి భవన్ వీడి కేసీఆర్ రైతుల వద్దకు వచ్చారని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. టీఎస్పీఎస్ పేపర్ లీకేజ్ వ్యవహారాన్ని ఒకరిద్దరు వ్యక్తులకు ఆపాదించి ఈ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇంత పెద్ద నేరం జరిగితే చిన్న విషయంగా పరిగణించడం విడ్డూరమని అన్నారు. ఇప్పటివరకు టీఎస్పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయకపోవడం నైతిక బాధ్యత వహించకపోవడం హాస్యాస్పదమన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. కేటీఆర్ వెంటనే ఆ పదవి నుండి తప్పుకోవాలని, పేపర్ లీకేజీ వ్యవహారంపై రేపు బండి సంజయ్ నేతృత్వంలో హైదరాబాదులో నిర్వహిస్తున్న మహా ధర్నాకు ఖమ్మం జిల్లా నుండి పెద్ద ఎత్తున బిజెపి నాయకులు కార్యకర్తలు నిరుద్యోగులతో కలిసి హాజరవుతున్నామని అన్నారు. ఖమ్మం బిజెపి కార్యాలయంలో జరిగిన యొక్క పత్రిక విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్ రాథోడ్, రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు మంద సరస్వతి, బోయినపల్లి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి అత్తి విజయ రెడ్డి, జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డ అరుణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చావా కిరణ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లారావు గౌడ్, ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షులు పిల్లలమర్రి వెంకట్, అర్బన్ టౌన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాస్, డి కొండ శ్యామ్, మోతుకూరి శ్రీనివాస్, పసుమర్తి సతీష్, సుగుణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ దుశ్చర్యకు పరాకాష్ట

కేంద్రం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు తిలోదాకాలిచ్చిందన్నారు.రత దేశ చరిత్రలో నేడు చీకటి రోజు గా నామ అభివర్ణించారు. బీజేపీ దుశ్చర్యను ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని నామ నాగేశ్వరరావు కోరారు. దర్యాప్తు సంస్థల అండతో ప్రతి పక్షాల గొంతు నొక్కుతున్నారని నామ అన్నారు.పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ చేసే విదంగా కేంద్రం చర్యలున్నాయని తెలిపారు.బీజేపీ దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తప్పక తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్య దురదృష్టకరమని నామపేర్కొన్నారు.

**రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులపై దాడి" : జావిద్**

దోషిగా తేలిన ఎవరికైనా అప్పీల్ చేయడం ప్రాథమిక హక్కు అని, న్యాయమూర్తి తన తీర్పులో దీనిని ఎత్తి చూపారని, రాహుల్ గాంధీకి ప్రతిస్పందించడానికి 30 రోజుల సమయం ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం దుర్మార్గమని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ అన్నారు. అదానీ కుంభకోణంపై చర్చ జరగకుండా ఉండేందుకే రాహుల్పై వేటు వేశారని మండిపడ్డారు. 'రాహుల్ గాంధీని చూసి బీజేపీ నాయకత్వం ఏ స్థాయిలో భయపడుతోందో ఇది తెలియజేస్తోంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రజల్లో సృష్టించిన విపరీతమైన ప్రభావం దీనికి కారణం. పార్లమెంట్‌లో గాంధీ లేవనెత్తిన అంశాలకు కేంద్రం సమాధానం చెప్పలేకపోతోంది. ఆయన పార్లమెంట్‌లో కొనసాగడం వల్ల బీజేపీకి రాజకీయ సంక్షోభం ఏర్పడుతుందనే భయంతో ఆయనపై అనర్హత వేటు పడింది" అని అన్నారు. ఈ చర్య ద్వారా బీజేపీ ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉచ్చరించే సామర్థ్యాన్ని కోల్పోయింది. పార్లమెంటులో లేవనెత్తిన ప్రశ్నలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎన్ని కుట్రలు జరిగినా సరే రాహుల్ గాంధీ ఈ పోరాటాన్ని వెనకడుగు వెయ్యదని రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లో సె సెక్షన్ 05 అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొంది. లోక్సభ సచివాలయం విడుదల చేసిన నోటిఫికేషన్పై కక్ష సాధించాలని

లోక్సభ సచివాలయం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. "లోక్సభ సచివాలయం ఒక ఎంపీపై అనర్హత వేటు వేయరాదు. రాష్ట్రపతి ఎన్నికల కమిషన్తో సంప్రదించిన తర్వాత చేయాల్సి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. రాహుల్ సభ్యత్వం రద్దుపై దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై ఇట్టి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పోరాటం జరుగుతుందని తెలిపారు

**రాహుల్ పట్ల బిజెపిది అనైతిక చర్య: సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**



సూరత్ కోర్టు తీర్పును సాకుగా చూపి రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం అనైతిక చర్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. బిజెపి రాహుల్ పట్ల వ్యవహరించిన తీరును సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయన్నారు. న్యాయస్థానాలు తీర్పుల విషయంలో గతంలో అనేక ఘటనలు జరిగాయని కానీ తీర్పు వచ్చిన 24 గంటల్లోనే పార్లమెంటరీ వ్యవస్థ ఇటువంటి నిర్ణయం తీసుకోవడం రాజకీయ కక్ష సాధింపేనని ప్రసాద్ తెలిపారు. కింది స్థాయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతోనే రాహుల్ దోషిగా నిర్ధారించలేమని న్యాయ స్థానం సైతం నెల రోజులు అవకాశం ఇచ్చి మరో కోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తే పార్లమెంటు కార్యనిర్వాహక వర్గం దీనిని ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని పోటు ప్రసాద్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ లేదా ఇతర ప్రతిపక్ష నేతలు పార్లమెంటులో తమకు ఎదురుగా ఉండరాదని మోడీ భావిస్తున్నారని మోడీ తనకు తానుగా నియంతగా ఊహించుకుంటున్నారని ప్రసాద్ ఆరోపించారు. దేశంలోని ప్రజాస్వామిక వాదులు దీనిని ఖండించాలని ప్రజాస్వామిక పరిరక్షణకు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన కోరారు. రాహుల్ పట్ల పార్లమెంటు కార్యనిర్వాహక వర్గం తీసుకున్న చర్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో బిజెపికి నూకలు చెల్లక తప్పదని ఆయన హెచ్చరించారు.

**రాహుల్ గాంధీపై చర్యను ఖండించండీ.. నున్నా నాగేశ్వరరావు**



విపక్ష నేత రాహుల్ పై పార్లమెంట్ సెక్రటేరియట్ అనర్హత వేటు వేయటం ప్రజాస్వామ్యపు గొంతు నొక్కి చర్య ,దొంగల పేర్లు మోడీకి ఎందుకు ఉంటాయన్న పదానికి శిక్ష వేయడం తొందరపాటు అయితే ఆ శిక్షను అపీలు చేసుకొనే సమయం కూడా ఇవ్వకుండా అదరాబాదర మోడీ ప్రభుత్వం అనర్హత వేటువేయడం ఫాసిస్ట్ చర్య ప్రతిపక్షం దాని గొంతు లేకుండా చేయాలని దుష్ట పథకం లో ప్లాన్ ప్రకారమే మోడీ ప్రభుత్వం ఈ చర్యకు పూనుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు.

# ఆడుకుంటూ నాణెం మింగిన బాలిక

**– జాగృత్ హాస్పిటల్‌లో ఎండోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స లేకుండానే నాణెం వెలికితీత**

**– ప్రాణాపాయం నుంచి చిన్నారికి రక్షణ**

**ఖమ్మం, మార్చి 24(విజయంన్యూస్):**

ఆడుకుంటూ చాక్లెట్ అనుకుని నాణెం(కాయిన్) మింగిన ఓ బాలిక అస్వస్థతకు గురయింది. దీంతో ఆమె కుటుంబీకులు హుటాహుటిన ఖమ్మం జాగృత్ గ్యాస్ట్రో అండ్ న్యూరో, యూరో ఎండోక్రైన్ హాస్పిటల్‌కు తీసుకురాగా.. ఆసుపత్రి వైద్య బృందం గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గంట హర్షవర్ధన్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, డాక్టర్ దుర్గాప్రసాద్, అనస్తీషియా డాక్టర్ మానస ఆధ్వర్యంలో ఎండోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఆ పాప మింగిన నాణేన్ని బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లి పట్టణానికి చెందిన మేడిశెట్టి శివ, సిరి దంపతుల కుమార్తె భవ్య(6)శుక్రవారం ఆడుకుటుండగా చాక్లెట్ అనుకుని నాణేన్ని మింగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పాపను హుటాహుటిన ఖమ్మంలోని జాగృత్ గ్యాస్ట్రో అండ్ న్యూరో, యూరో ఎండోక్రైన్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గంటా హర్షవర్ధన్, డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, డాక్టర్ దుర్గాప్రసాద్, అనస్తీషియా డాక్టర్ మానస, అసిస్టెంట్ సత్య ఆ పాపకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఎండోస్కోపీ ద్వారా నాణెం బయటికి తీశారు. ప్రస్తుతం పాప ఆసుపత్రిలో కోలుకుంటోంది. ఈ శస్త్రచికిత్సలో ఓటీ అసిస్టెంట్ సురేష్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# రాష్ట్రపతి విందుకు హాజరైన ఎంపీలు

## రాష్ట్రపతి ఆతిథ్యం స్వీకరించిన ఎంపీలు కేశవరావు,నామా, వద్దిరాజు,బండి తదితరులు

**(ఖమ్మంప్రతినిధి–విజయంన్యూస్)**

దేశాధ్యక్షురాలు ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు,లోకసభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బండి పార్థసారథి రెడ్డి తదితర ఎంపీలు రాష్ట్రపతి భవన్ ను సందర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన ఆతిథ్యాన్ని వారు ఇతర ఎంపీలతో కలిసి స్వీకరించారు.పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ఉభయ సభల సభ్యులను దశల వారీగా పిలిచి ఆతిథ్యం ఇస్తున్నారు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఎంపీలు కేశవరావు, నాగేశ్వరరావు,రవిచంద్ర, పార్థసారథి రెడ్డి,కే.ఆర్.సురేష్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్,పీ.రాములు,బీ.బీ.పాటిల్,మన్నె శ్రీనివాస్ రెడ్డిలు ఇతర ఎంపీలతో పాటు శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్ సందర్శించి ఆమెతో కలిసి అల్పాహారం,తేనీరు తీసుకున్నారు.



# పంచాయతీల అభివద్దే లక్ష్యంగా పనిచేస్తా

## ఉత్తమ పంచాయతీ సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే

**(కూసుమంచి–విజయంన్యూస్)**

ప్రతి ఒక్క పంచాయతీ అభివద్ది కోసం తనవంతు కషి ఉంటుందని, తప్పకుండా అభివద్దే లక్ష్యంగా పనిచేస్తానని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి హామినిచ్చారు. శుక్రవారం కూసుమంచి మండలం కేంద్రం లోని రైతువేధిక నందు కూసుమంచి మండలంకు సంబంధించి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీకార్యదర్శులను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి సన్మానించి వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. అనంతరం ఎంపీపీ బానోతు శ్రీనివాస్ నాయక్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఎంపీవో రాంచంద్రయ్యలను కూడా ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ శేఖర్, పెరికసింగారం గ్రామ మోదుగు వీరభద్రం మండల పార్టీ అధ్యక్షుడు వేముల వీరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు

# నేడు భద్రాచలం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం

**ఖమ్మం,మార్చి 24(విజయం న్యూస్):**

భద్రాచలం నియోజకవర్గ స్థాయి పొంగులేటి శీనన్న అభిమానుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25న శనివారం భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరగనుంది. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆత్మీయ సమ్మేళనానికి భద్రాచలం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని దయాకర్ రెడ్డి కోరారు.

# కంటివెలుగు ప్రజలందరికి వెలుగు



**– ప్రజలందరు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి**

**– రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ అల్లిపురంలో కంటివెలుగును ప్రారంభించిన మంత్రి పువ్వాడ**

**ఖమ్మంప్రతినిధి, రఘునాథపాలెం, మార్చి,24(విజయం న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 100 రోజుల పాటు చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, కంటి వెలుగు పథకం మన ఇంటికే వెలుగు లాంటిదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు తెలిపారు. శుక్రవారం ఖమ్మం కార్పోరేషన్ 15వ డివిజన్ అల్లిపురం రైతు వేదిక, 24వ డివిజన్ శాంతి నగర్‌ల లోని మిషన్ హాస్పిటల్ నందు ఎర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ వి. పి. గౌతమ్ తో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ కంటి పరీక్ష జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. మన ముఖ్యమంత్రివర్యులు ఎంతో ముందు చూపుతో తలపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరు కలిసి విజయవంతం చేద్దామని ఆయన అన్నారు. రెండవ విడత కంటి వెలుగు ఖమ్మం ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర వ్యాప్తంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, కె.చంద్రశేఖర్‌రావు అధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. గ్రామాల్లో కంటి చూపు సమస్యతో బాధపడే వారి బాధలు తీర్చేందుకు ముఖ్యమంత్రి ఎంతో ముందు చూపుతో కంటి వెలుగు అనే ఈ గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం ఎంతో అద్భుతంగా విజయవంతం అయిందన్నారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు కంటి చూపు పట్ల అశ్రద్ధ చేయకుండా ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకుని విజయవంతం చేయాలని అన్నారు. కంటి వెలుగు నిర్వహించేందుకు గ్రామంలో కావాల్సిన వసతులను స్థానిక ప్రజాప్రతినిధులు దగ్గరుండి ఆయా సౌకర్యాలు కల్పించి గ్రామంలో ఉన్న ప్రజలను కంటి పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరినీ పంచాయతీ అధికారులు, నేతలు ఇంటికెళ్లి ఈ కార్యక్రమం దగ్గరకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్ళజోడు ఉచితంగా పంపిణీ, అలాగే అవసరం అయినా వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా చేస్తారని ఆయన తెలిపారు. ఇంత మంచి కార్యక్రమాన్ని మనం అందరం కలిసి విజయవంతం చేయాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికీ పరీక్ష జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు.

**– ఇనామ్ భూములకు హక్కుపత్రాలందించిన మంత్రి పువ్వాడ**

దీర్ఘకాలంగా ఆల్లిపురం గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న ఇనాం భూముల హక్కు సమస్యపై మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారి చొరవతో పరిష్కారం లభించిందని, ఇనాం భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓఆర్సీ) ద్వారా ఆయా భూమి మీద హక్కు కల్పించడం పట్ల మంత్రి వర్యులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ అల్లిపురం గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇనాం భూములకు సంబంధించిన సమస్యను మన రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు ప్రత్యేక చొరవ తీసుకొని 60 మందికి ఓఆర్సీ ఇప్పించడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. రాష్ట్రంలో ఒ.ఆర్.సికి సంబంధించి ప్రక్రియ నిలుపుదల చేయడం జరిగిందని, మన జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతో రైతుల పక్షపాతిగా ఉండిమంత్రివర్యులు నేడు పట్టాలు అందించడం జరిగిందన్నారు. అల్లీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రానికి పరిధిలో ఉన్న వారందరు మన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగపుర్చుకొని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటిచూపును కాపాడుకోవాలన్నారు. రీడింగ్, కుట్టుమిషన్, వెల్డింగ్ వర్క్స్ చేసే వారందరికి ఏదో చిన్న కంటి లోపం ఉంటుందని ఈ కార్యక్రమంలో పరీక్షలు చేయించుకొని నివారించుకోవాలని కలెక్టర్ కోరారు. రీడిరగ్, ప్రిస్కిప్షన్ కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 3 లక్షల మందికి కంటి పరీక్షలు చేసి కళ్ళ జోడ్లను అందిచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూధన్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దోరెపల్లి శ్వేత, రెవిన్యూ డివిజన్ అధికారి రవీంద్రనాథ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ మాలతీ, డాక్టర్ బాలకృష్ణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రావూరి కరుణ, వలరాజు,ఖమ్మం అర్బన్ తహసిల్దార్ శ్శైలజ, తదితరులు పాల్గొన్నారు. –







## మస్జీద్‌లో మంత్రి పువ్వాడ ప్రత్యేక ప్రార్థనలు

### నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

ముస్లిములు ఈద్-ఉల్-ఫితర్ పండగను నిర్వహించుకుని ఆనందంగా, సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఖమ్మం నగరం 57వ డివిజన్ రెహమాన్ నగర్ మజీద్ నందు మంత్రి పువ్వాడ పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ ఆచరించి, ఉపవాస దీక్షలు చేస్తున్న పేద ముస్లింలకు ఖమ్మం సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ ఆశ్రిఫ్ అధ్వర్యంలో నెల రోజులకు సరిపడ బియ్యం, నిత్యావసర సరుకులు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశ్రిఫ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా సోదరులు ఎంతో నిష్టగా ఉపవాస దీక్షలు చేస్తారని అన్నారు. ఆ అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలి అని మంత్రి పువ్వాడ ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నాయకత్వం లో రాష్ట్రంలో మతాల మధ్య ఘర్షణలు లేకుండా స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండే సంస్కృతి ఉందని మంత్రి అజయ్ కుమార్ పేర్కొన్నారు.



**53వ డివిజన్‌లో**

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభోత్సవం సందర్భంగా ఖమ్మం నగరం 53వ డివిజన్ హాలీమా ఖతుం మాజిద్ నందు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి పువ్వాడ హాజరయ్యారు. పవిత్ర రంజాన్ మాసంలో తొలి రోజు ఉపవాస దీక్షలు చేస్తున్న వారికి పండ్లు తినిపించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దీక్షను విరమింపజేశారు. అనంతరం భోజన విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసిఆర్ ప్రభుత్వ హాయాంలో రాష్ట్రంలో మతాల మధ్య ఘర్షణలు లేకుండా స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండే సంస్కృతిని పెంపొందించారని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని మజీద్ ల అధ్వర్యంలో దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నామని అన్నారు.

